aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
2-10-2026
సంపుటి : 01 సంచిక :191 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
- నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
- శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భాలీ ర్యాలీ
- సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

- వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
- తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
- బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
- ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
- ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
- ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
- వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
- భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
- త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం



ఉద్యోగులకు తీపికబురు

రెండు బకాయి డిఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
- ప్రభుత్వంపై ఏడాదికి రూ.2,500 కోట్లు అదనపు భారం
- వాయిదాల్లో ఏరియర్స్ చెల్లింపు
- రాష్ట్రంలో కరువు పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ
- కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని నిర్ణయం
- ఎల్ నినోపై అఖిలపక్షం
- సహాయక చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు కోరాలని నిర్ణయం
- కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన సహాయం అందించాలని కేంద్రానికి అభ్యర్థన
- త్వరలో ఢిల్లీకి రాష్ట్ర మంత్రులు
- డిమాండ్ మేరకు విద్యుత్ కొనుగోలు
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పనిచేసేందుకు నలుగురు గ్రూప్-1 అధికారులు
- కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్

/హైదరాబాద్: -01అక్టోబర్ (మహాప్రభ).
దసరా సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీకి సంబంధించిన అంశాలను మంత్రి పొంగులేటి సమాచార మంత్రులతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 2024 నుంచి బకాయి ఉన్న డిఏల్లో రెండు డిఏలను వెంటనే మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి నుంచి బకాయి పడ్డ ఏరియర్స్‌ను వాయిదాల్లో చెల్లించాలని మంత్రి వర్గం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డిఏ, పెన్షనర్లకు డిఆర్ మంజూరు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు.

-మిగతా 3 లో





ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే

- ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం
- అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- చలికాలంలోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం
- అక్టోబర్--డిసెంబర్‌లో తక్కువ వర్షపాతం
- తెలంగాణలో 18 శాతం లోటు వర్షపాతం
- 19 జిల్లాల్లో లోటు.. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం
- నల్గొండ, నిర్మల్‌లో అత్యధిక వర్షపాతం లోటు
- కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాలలో అధిక వర్షపాతం
- ఎల్నినో ప్రభావం శీతాకాలంపైనా ఉంటుందన్న ఐఎండీ



దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

- శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా
- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్, -01అక్టోబర్ (మహాప్రభ).
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్

-మిగతా 3 లో

శభాష్ స్మిత్

భారత్ కీర్తి రెపరెపలు

- భారతీయ పైలట్ మచ్చర్కు ప్రశంసల వెల్లువ
- భారత్ గర్విస్తోంది: ప్రధాని మోడీ
- అసలైన హీరో: నెతన్యాహు శాల్యూట్
- రియల్ హీరో: ట్రంప్ ప్రశంసలు
- రాష్ట్రపతి ముర్ము నుంచి రాజ్నాథ్, జైశంకర్ వరకు అభినందనలు

పై దుబాయ్ విమానంలో కోపైలట్ జరిపిన దాడిలోతీవ్రంగాగాయపడినప్పటికీ ప్రయాణికుల రక్షణ కోసం తన ప్రాణాలను రిస్క్‌లో పెట్టిన భారతీయ పైలట్ స్మిత్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆయనను రియల్ హీరోగా ప్రపంచాధినేతలు అభివర్ణించారు. మెరుగైన చికిత్స కోసం స్మిత్‌ను యుఎఇకి తరలించారు.
విమానం కూల్చడానికి ఒమన్ కు చెందిన కోపైలట్ ప్రయత్నించాడంటూ వార్తలు వెలువడుతున్నాయి. అతడిని ఓ మత ఛాందసవాదిగా ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు పేర్కొన్నారు.



మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా



సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

- 24 బిలియన్లు దాటిన లావాదేవీలు
- ఏడాదిలో 23 శాతం పెరిగిన యూపీఐ లావాదేవీలు
- సెప్టెంబర్‌లో 24.07 బిలియన్ల ట్రాన్సాక్షన్లు
- లావాదేవీల విలువ రూ.29.37 లక్షల కోట్లు
- రోజుకు సగటున 802 మిలియన్ల లావాదేవీలు
- ఆగస్టుతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన లావాదేవీలు
- రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐపై ని 0.4 శాతం ఎండీఆర్ ప్రతిపాదన
- వ్యాపార సంఘాల నిరసనతో కేంద్రంతో చర్చలు
- చిన్న వ్యాపారులకు ఎండీఆర్ నుంచి మినహాయింపు

న్యూఢిల్లీ, -01అక్టోబర్ (మహాప్రభ).
దేశంలో 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ' తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. సెప్టెంబర్ నెలలో కూడా యూపీఐ లావాదేవీలు పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 23 శాతం పెరిగి 24.07 బిలియన్లకు చేరుకుంది. ఇక లావాదేవీల విలువ

-మిగతా 3 లో

సిద్ధమా

తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!



- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు రెడీ
- సిఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- రాష్ట్రంలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు
- ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయారా!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, -01అక్టోబర్ (మహాప్రభ).
తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం

-మిగతా 3 లో



అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు

హైదరాబాద్, -01అక్టోబర్ (మహాప్రభ).
తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళికలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

-మిగతా 3 లో

జింబాబ్వేలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి

మారోండెరా గ్రామీణ ప్రాంతంలో ప్రమాదం
హెలికాప్టర్‌లో ఏడుగురు ఉన్నట్లు ప్రభుత్వ ప్రకటన
ప్రముఖ వ్యాపారవేత్త సహా ఏడుగురు మృతి
ఇద్దరు పైలట్లు, నలుగురు ప్రయాణికులు మృతి
ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదు
ఘటనా స్థలానికి చేరుకున్న అత్యవసర సిబ్బంది
మృతుల సంఖ్యపై భిన్న కథనాలు
పూర్తి వివరాల కోసం కొనసాగుతున్న దర్యాప్తు




హరారే: -01అక్టోబర్ (మహాప్రభ
జింబాబ్వేలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని మారోండెరా గ్రామీణ ప్రాంతంలో బుధవారం హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ప్రముఖ వ్యాపారవేత్తతో పాటు నలుగురు ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా మొత్తం ఏడుగురు మృతి చెందినట్లు ప్రభుత్వ ప్రతినిధి నిక్ మంగ్వానా వెల్లడించారు. హెలికాప్టర్ ప్రమాదానికి గురైన విషయం తెలియగానే అత్యవసర సేవల సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసే ప్రక్రియను ప్రారంభించారు. ప్రమాదంలో ప్రయాణిస్తున్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల సంఖ్యపై భిన్నమైన సమాచారం వెలువడుతోంది. హెలికాప్టర్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంలో పోలీసుల వివరాలకు, ప్రభుత్వ ప్రతినిధి వెల్లడించిన సమాచారానికి పొంతన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మృతుల సంఖ్య అధికారికంగా వెల్లడించిన దానికంటే ఎక్కువగా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగానే కూలిపోయిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

జనన, మరణాల నమోదుకు కొత్త రూల్స్



న్యూఢిల్లీ -01అక్టోబర్ (మహాప్రభ).
జనన-మరణాల నమోదు చట్టం-2026 గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జనన, మరణాల రిజిస్ట్రేషన్ల ఆలస్యంపై నిబంధనలు మరింత కఠినతరం కానున్నాయి. ఇక నుంచి వ్యక్తి జన్మించిన లేదా మరణించిన ఏడాది తర్వాత రెండేండ్ల లోపు సమాచారం ఇస్తే.. జిల్లా మెజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ లేదంటే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారం ఉన్న అధికారి తనిఖీ చేసి ఆదేశాలు ఇచ్చిన తర్వాత సంబంధిత రుసుము చెల్లించాక నమోదు చేస్తారు.. ఒకవేళ రెండేండ్లు దాటిన తర్వాత సమాచారం ఇస్తే ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ కొత్త చట్టం ప్రకారం జనన, మరణాల చట్టం 1969లోని 13(3)ను మార్చడంతో పాటు కొత్తగా సెక్షన్ 13(3ఏ)ను చేర్చారు.

అన్ని విమానాశ్రయాల్లో ఫుల్ బాడీ స్కానర్లు!



న్యూఢిల్లీ-01అక్టోబర్ (మహాప్రభ
పశ్చిమాసియాలో ఫ్లైదుబాయ్ విమాన ఘటనతో భారత్ అప్రమత్తమైంది. ఇకపై అన్ని విమానాశ్రయాల్లో పూర్తి బాడీ స్కానర్లు (ఎఫ్‌బీఎస్)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైమానిక భద్రతా వ్యవస్థ పటిష్ఠతలో భాగంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్టు పౌరవిమానయాన శాఖ అధికారులు తెలిపారు. మొద టి దశలో ఎనిమిది విమానాశ్రయా ల్లో వీటిని ఏర్పాటు చేస్తామని ఆ శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా తెలిపారు. ఇప్పటికే మూడు ఎయిర్‌పోర్టులకు స్కానర్ మిషన్లను పంపినట్టు తెలిపారు. మిగిలిన ఐదింటిలో త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎస్పీతో టచ్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు!

వెల్లడించిన అఖిలేశ్ యాదవ్



లక్నో,-01అక్టోబర్ (మహాప్రభ).
చాలామంది బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీతో టచ్‌లో ఉన్నారని, అయితే వారందరికీ పార్టీలో స్థానం కల్పించడం కష్టమని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తామంటూ ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అయితే వారికి స్థానం కల్పించే పరిస్థితి పార్టీలో లేదని పేర్కొన్నారు. మేం కేవలం వారికి మాట ఇచ్చి తర్వాత వాటిని తప్పాలని అనుకోవడం లేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల మాదిరిగానే అదే కూటమి పార్టీలతో కలిసి వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పోటీకి దిగుతామని చెప్పారు. త్వరలోనే కూటమి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

తొమ్మిదేళ్ల తర్వాత కాంగ్రెస్‌లోకి వాఘేలా?

-కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమన్న శంకర్‌సింహ్ వాఘేలా
-రాహుల్‌గాంధీతో భేటీ తర్వాత తుది నిర్ణయం
-కాంగ్రెస్ నేతలతో కొనసాగుతున్న చర్చలు
-రణ్‌దీప్ సూర్జేవాలాతోనూ భేటీ
-అమిత్ చావ్డా, భరత్‌సింహ్ సోలంకితో చర్చలు
-2027 ఎన్నికలే చివరి అవకాశమన్న వాఘేలా
-2017లో కాంగ్రెస్‌ను వీడిన వాఘేలా
-సొంత పార్టీ కార్యక్రమాన్ని వాయిదా



గాంధీనగర్: -01అక్టోబర్ (మహాప్రభ).
గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత శంకర్‌సింహ్ వాఘేలా దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతలతో తనకు చర్చలు జరుగుతున్నాయని వాఘేలా స్వయంగా వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌లో తిరిగి చేరడంపై తుది నిర్ణయం మాత్రం రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. 2027 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వాఘేలా తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నుంచి తనకు ఎలాంటి పదవి లేదా ఇతర ప్రయోజనాలు ఆశించడం లేదని, కాంగ్రెస్‌కు తన వంతు సహకారం అందించేందుకే తిరిగి రావాలని భావిస్తున్నట్లు చెప్పారు. వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్ గుజరాత్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా, గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా, మాజీ కేంద్ర మంత్రి భరత్‌సింహ్ సోలంకితో చర్చలు జరిపినట్లు సమాచారం. వాఘేలా తిరిగి పార్టీలోకి వచ్చే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు కొనసాగుతున్నాయని అమిత్ చావ్డా కూడా తెలిపారు. అయితే ఆయనకు పార్టీలో ఎలాంటి బాధ్యత అప్పగించాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2017లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు వాఘేలా కాంగ్రెస్‌ను వీడారు. ఆ తర్వాత వివిధ రాజకీయ ప్రయత్నాలు చేసిన ఆయన.. ప్రస్తుతం తిరిగి కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఆయన కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తారా అనే అంశంపై గుజరాత్ రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, అక్టోబర్ 2న తన సొంత పార్టీ 'ప్రజా శక్తి డెమోక్రటిక్ పార్టీ' కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు వాఘేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్‌తో జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. దీంతో ఆయన తదుపరి రాజకీయ అడుగు కాంగ్రెస్ వైపే ఉంటుందా అనే ఆసక్తి నెలకొంది. వాఘేలా కుమారుడు మహేంద్రసింహ్ వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం వాఘేలా పునరాగమనంపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా రాహుల్‌గాంధీతో వాఘేలా భేటీ తర్వాతే చేరికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఫ్రాన్స్‌లో జెన్ ఆల్ఫా నిరసనలు.. స్కూళ్ల సమస్యలపై విద్యార్థుల ఉద్యమం

-మెరుగైన పాఠశాల సదుపాయాల కోసం విద్యార్థుల ఆందోళన
-టైమ్‌టేబుల్‌పై విద్యార్థుల అభ్యంతరాలు
-తరగతుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గించాలని డిమాండ్
-టీచర్ల కొరతపై నిరసన
-ఉక్కపోత తరగతి గదులపై ఆగ్రహం
-పారిస్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించిన ఆందోళనలు
-400 స్కూళ్లపై నిరసనల ప్రభావం
-440 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పారిస్: -01అక్టోబర్ (మహాప్రభ).
పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. కొన్ని చోట్ల చెత్త బుట్టలకు నిప్పు పెట్టడంతో పాటు పోలీసులపైకి వస్తువులు విసిరారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలపై విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేస్తున్నారు. పాఠశాలల టైమ్‌టేబుల్, ఒక్కో తరగతిలో ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత, ఉక్కపోతగా ఉండే తరగతి గదులు వంటి అంశాలను వారు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తొలుత పారిస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ ఆందోళనలు క్రమంగా దేశంలోని ఇతర నగరాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది నిరసన కవాతుల్లో పాల్గొన్నారని విద్యార్థి సంఘాలు తెలిపాయి. పాఠశాలల్లో తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నగర శివార్లకు చెందిన మేము నిర్లక్ష్యానికి, విస్మరణకు గురయ్యాం. ఇక్కడ పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయి' అని విక్టోయిర్ అనే 16 ఏళ్ల విద్యార్థిని పేర్కొంది. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని ఆమె ఆరోపించింది. మరోవైపు విద్యార్థుల నిరసనల ప్రభావంతో దేశవ్యాప్తంగా సుమారు 400 పాఠశాలలు ప్రభావితమైనట్లు ఫ్రాన్స్ విద్యాశాఖ వెల్లడించింది. ఆందోళనల సందర్భంగా 440 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ దేశ హోం మంత్రి లారెంట్ తెలిపారు. నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

బ్లూ డ్రమ్ తరహాలో మరో ఘటన..

వృద్ధ మహిళను చంపి డ్రమ్ములో దాచిన దంపతులు



న్యూఢిల్లీ-01అక్టోబర్ (మహాప్రభ
యూపీ, మీరట్ బ్లూ డ్రమ్ తరహాలో ఒక వృద్ధురాలిని చంపి డ్రమ్ములో సిమెంట్‌తో పూడ్చిపెట్టారు దంపతులు. ఈ ఘటన జరిగి నాలుగేళ్లవుతోంది. ఈ ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగింది. అంతేకాదు.. ఈ దంపతులు మరో ఇద్దరు మహిళల్ని కూడా హతమార్చారు. హత్యకు గురైన ముగ్గురూ వారి కుటుంబ సభ్యులే. 2022లో ఈ ఘటన జరిగింది. మాధవ్ దాస్, ఊర్మిళ దంపతులు ఈ హత్యలకు పాల్పడ్డారు. మృతుల్లో ఒకరు ఊర్మిళ నానమ్మ శాంతాబెన్ వాసవ. రెండో మహిళ ఊర్మిళ సోదరి భాగవతి వాసవ. మూడో మహిళ మాధవ్‌దాస్ తల్లి మంజులాబెన్ సాధు.ముగ్గురినీ ఊపిరాడకుండా చేసి చంపారు. మొదట శాంతాబెన్ వాసవ అనే 70 ఏళ్ల వృద్ధురాలిని ఊపిరాడకుండా చేసి, ఇంట్లోనే హతమార్చారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఒక పెద్ద డ్రమ్ములో ఉంచారు. పైనుంచి సిమెంటు పోసి, పూడ్చేశారు. తర్వాత ఇంటి వెనుక పెరటిలో గొయ్యి తీసి, ఆ డ్రమ్మును పాటిపెట్టారు. ఈ హత్య 2022లో చేశారు. ఆ సమయంలో కోవిడ్ ఉధృతంగా ఉంది. శాంతాబెన్ ఏమైందని బంధువులు, చుట్టుపక్కల వాళ్లు అడిగితే.. కోవిడ్ కారణంగా మరణించిందని, దీంతో ఆస్పత్రి నుంచి నేరుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించామని చెప్పారు. ఆ తర్వాత కొంతకాలానికి భగవతిని, మంజులాబెన్‌ను కూడా వరుసగా ఈ దంపతులు హత్య చేశారు. అయితే, కొంతకాలానికి ఈ హత్యలకు పాల్పడ్డ మాధవ్‌దాస్-ఊర్మిళ దంపతులు విబేధాల కారణంగా విడిపోయారు. ఊర్మిళ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కొడుకుతోపాటు నగలు, డబ్బు వంటివి కూడా పట్టుకెళ్లింది. దీంతో భర్త మాధవ్‌దాస్ ఆమెపై పగతో రగిలిపోయాడు. భార్యపై ఎలాగైనా పగ తీర్చుకోవాలి అనుకున్నాడు. ఇందుకు తాము చేసిన హత్యలను వినియోగించుకోవాలని నిర్ణయించాడు. ఒక హత్యను భార్య చేసినట్లుగా ఫిర్యాదు చేశాడు. తన తల్లి మంజులాబెన్‌ను భార్య ఊర్మిళ, ఆమె సోదరుడు అష్టల్ కలిసి హత్య చేసినట్లు అహ్మదాబాద్ పోలీసులకు మాధవ్‌దాస్ ఫిర్యాదు చేశాడు.దీనిపై విచారణ జరుపుతున్న క్రమంలో మాధవ్ దాస్ చెబుతున్నదాంట్లో అనేక తప్పులు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో ఆరాతీయగా.. తన తల్లిని భార్యతో కలిసి తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. దీంతో ఈ ఒక్క హత్యపై విచారణ జరుపుతుండగా.. మిగతా రెండు హత్యల గురించి కూడా తెలిసింది. 2022లో ఈ హత్యలు జరగగా నాలుగేళ్ల తర్వాత ఈ ఘటన బయటపడింది. అది కూడా భర్త మాధవ్‌దాస్ చేసిన పోరపాటు, అతి తెలివి వల్లే.

మహారాష్ట్రలో విషాదం..

బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి



న్యూఢిల్లీ-01అక్టోబర్ (మహాప్రభ
మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు.ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు.

సీఈసీ రాజీనామా చేయాల్సిందే..

-లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
-సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
-నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
-శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
-సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



న్యూఢిల్లీ,
ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్ధమయ్యారు. రేనేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్ధమవుతోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి. వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు. మరోవైపు శివాజీ పార్క్ వద్ద రేపటి కాక్రోచ్ ల ఆందోళనలకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. స్థానికుల ఆందోళనలను ఇందుకు సాకుగా చూపింది. దీనిపై స్పందించిన దిప్కే.. తాము ఎట్టి పరిస్థితుల్లో జైల్ భరోకు దిగుతామని, చేతనైతే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే



న్యూఢిల్లీ,
వర్షాకాలం ముగిసి నేటితో శీతాకాలం ప్రారంభమైంది. ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన శీతాకాలం బులెటిన్లో పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 18 శాతం లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేల్చింది. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేలింది. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న జిల్లాలుగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్గిరి నమోదయ్యాయి. కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధిక వర్షపాతం నమోదైంది. తెలంగాణపై ప్రభావం చూపేలా ఏడు అల్పపీడనాలు ఏర్పడగా అందులో ఆరు వాయుగుండాలు, మూడు తీవ్ర వాయుగుండాలుగా మారి ఈ వర్షపాతానికి కారణమయ్యాయి. జూన్ మాసంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడంతో లోటు వర్షపాతానికి దారి తీసినట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి భారత్లోకి నైరుతి రుతుపవనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. తెలంగాణలోకి సరైన సమయంలోనే అంటే జూన్ 8న ప్రవేశించినప్పటికీ వారం రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లా అయిన జోగులాంబ గద్వాల ప్రాంతంలోనే ఆగిపోయాయి. వారం రోజుల తరువాత మందకోడిగా ముందుకు కదిలి పదిహేను రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏడు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ అల్పపీడనాలు ఆరు వాయుగుండాలుగా మారాయి.

దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

(మొదటి తరువాయి)

హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

(మొదటి తరువాయి)

18 శాతం వృద్ధితో రూ.29.37 లక్షల కోట్లుగా నమోదైంది. సెప్టెంబర్‌లో ప్రతిరోజూ సగటున 802 మిలియన్ల లావాదేవీలు జరుగగా వాటి విలువ సుమారు రూ.97,913 కోట్లుగా ఉంది. ఆగస్టు నెలలో నమోదైన 24.51 బిలియన్ల లావాదేవీలతో పోలిస్తే సెప్టెంబర్‌లో స్వల్ప తగ్గుదల కనిపించినా వార్షిక వృద్ధి మాత్రం బలంగా కొనసాగుతున్నది. ఇదే సమయంలో ఐఎంపీఎస్ ద్వారా జరిగిన లావాదేవీల విలువ కూడా 18 శాతం పెరిగి రూ.7.06 లక్షల కోట్లకు చేరింది. ఇదిలావుంటే రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' విధించాలన్న ప్రతిపాదనను వ్యాపారవర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం చిన్న, మధ్యతరహా వ్యాపారులపై భారం మోపుతుందని, డిజిటల్ చెల్లింపుల స్వీకరణను దెబ్బతీస్తుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. దీనికి నిరసనగా అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య సహా పలు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో చాందినీ చౌక్ ఎంపీ, సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ నేతృత్వంలోని సుమారు 20 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైంది. ఈ భేటీ తర్వాత వ్యాపార సంఘాలు తమ నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి. ప్రభుత్వం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ కొత్త ఛార్జీల విధానం కేవలం రూ.2,000 మించిన మర్చంట్ (పీ2పీ) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీలలో 96 శాతానికిపైగా రూ.2,000 లోపే ఉంటున్నాయని, కాబట్టి అత్యధిక శాతం లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని వివరించింది. అంతేగాక నెలవారీగా రూ.1 లక్షవరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టంచేసింది.

కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

-వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
-తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
-బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
-ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
-ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
-ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
-వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
-భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
-త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం



ఎంత ఫాస్టాగ్ వాడుతున్నా టోల్ ప్లాజాల దగ్గర కొన్ని క్షణాలపాటైనా ఆగాల్సిందే. టోల్‌ప్లాజాల దగ్గర చెల్లింపుల సమయంలో వాహనాలు ఆగేందుకు బ్యారియర్లు ఉంటాయి. అయితే, తమిళనాడులో అసలు వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయవచ్చు. టోల్‌ప్లాజా దగ్గర బ్యారియర్లు కూడా తీసేశారు. ఇది తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజా వద్ద అమలవుతున్న కొత్త టెక్నాలజీ వ్యవస్థ. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందితమిళనాడులోని తాంబరం–టిండివనం పట్టణాల మధ్య గల పరనూర్ వద్ద 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలో ఈ విధానం అమలవుతోంది. ఇది 46.5 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారి. అక్టోబర్ 1, గురువారం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడి టోల్‌ప్లాజాను మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) కింద అభివృద్ధి చేయడంతో ఈ టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు ఆగకుండా నేరుగా వెళ్లిపోవచ్చు. అయితే, ఇదే మొదటి బ్యారియర్ ఫ్రీ టోల్‌ప్లాజా కాదు. ఇంతకుముందు ముంబై నేషనల్ హైవే 48పై, సూరత్–భరూచ్ మధ్య కాప్రేజ్–చోర్యాసి మధ్య ఉన్న టోల్‌ప్లాజాలో గత మే నుంచే ఈ విధానం అమలవుతోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర టోల్‌ప్లాజాలకు కూడా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. వాహనాలన్నీ ఫాస్టాగ్‌తో లింకై ఉంటాయన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫాస్టాగ్‌ను రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ టెక్నాలజీ ద్వారా ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్.. ఫాస్టాగ్‌ను గుర్తిస్తుంది. అలాగే, కెమెరాలు వాహన రిజిస్ట్రేషన్ నెంబర్‌ను గుర్తిస్తాయి. ఈ ఫాస్టాగ్, వాహన నెంబర్ ఆధారంగా ఆటోమేటిగ్గా చెల్లింపు జరిగిపోతుంది. దీంతో వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోవచ్చు. అయితే, ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉండటం తప్పనిసరి. టోల్‌ప్లాజాల దగ్గర వాహనాల భారీ క్యూలైన్లు, నెమ్మదిగా కదిలే పరిస్థితిని తగ్గించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది.

ఉద్యోగులకు తీపికబురు

(మొదటి తరువాయి)

ఈ రెండు డిఏల వల్ల ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2,500 కోట్ల భారం పడుతుంది. దాదాపు ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ లో సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉందని, నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని కరువు ప్రాంతాల్లో తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఎల్ నినో పరిస్థితులు చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కరువు ప్రాంతాల ప్రకటనతో పాటు తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని సివిల్ సప్లైస్ విభాగం అంచనా వేసిందని ఆయన తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించిందన్నారు.
డిమాండ్ మేరకు విద్యుత్‌ను కొనుగోలు ఎల్ నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా ఈ సీజన్‌లో అది రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరిందని దాదాపుగా 20 వేల మెగావాట్లకు చేరిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. గతేడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ట వినియోగం నమోదయ్యిందని అందుకే విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, తగినంత విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భవిష్యత్ డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సూచించిందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపిసి విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను కేబినెట్ ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా 10 ఈపిసి సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపందన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుంది.

శభాష్ స్మిత్



న్యూఢిల్లీ,
దుబాయ్ నుండి ఫ్లై అల్జీరియా బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానంలో తలెత్తిన అత్యంత ప్రమాదకర దుర్ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ తన ప్రాణాల కంటే విమానంలోని వారి భద్రతకే ప్రాధాన్యం ఇచ్చిన ఆయనను భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలువురు ప్రపంచ నాయకులు "హీరో"గా అభివర్ణించారు. విమానంలో జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండటంతో దాడి వెనుక చేతులపై ఇంకా అధికారిక స్పష్టత వెలువడలేదు.
'భారత్ గర్విస్తోంది'.. మోడీ
ప్రధాని నరేంద్ర మోడీ స్మిత్ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో, తీవ్రంగా గాయపడినప్పటికీ ఆందోళన చెందకుండా ప్రయాణికులను కాపాడేందుకు అత్యున్నత ప్రొఫెషనలిజంను ప్రదర్శించారని కొనియాడారు. "స్మిత్ ధైర్యం వందల మంది ప్రాణాలను కాపాడటంతో పాటు భారీ విపత్తును నివారించింది" అని పేర్కొన్నారు. "కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఒక హీరో, భారత్ ఆయనను చూసి గర్విస్తోంది" అని పేర్కొన్నారు. స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన భార్య, తల్లిదండ్రులతోనూ ప్రధాని మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలోనూ మోడీ ఈ ఘటనను ప్రస్తావించారు. ఒక భారతీయుడు అత్యంత భారీ ఆకాశ విపత్తును నివారించడంలో కీలక పాత్ర పోషించాడని పేర్కొన్నారు.
నెతన్యాహు సెల్యూట్
ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్మిత్ను "నిజమైన హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన ప్రశాంతంగా కాక్పిట్ తలుపు తెరవడం వల్ల ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకోవడానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆయన చర్య భారీ ఆకాశ విపత్తును నివారించిందని ప్రశంసించారు. స్మిత్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ సామాజిక మాధ్యమాల్లో అతడి పేరు మారుమోగుతోంది. స్మిత్ మచ్చర్.. అతనొక నిజమైన హీరో... అంటూ వేలాది మంది కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ పైలట్ చిత్రాలను పంచుకుంటూ ఆయన ధైర్యాన్ని కొనియాడారు.
వాషింగ్టన్ నుంచి ట్రంప్ ప్రశంస
స్మిత్ సాహసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టిని ఆకర్షించింది. వైట్హౌస్లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ స్మిత్ను "హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడిన స్థితిలోనూ కాక్పిట్ తలుపు తెరిచి సహాయం కోరగిన ఆయన సమయస్ఫూర్తిని ప్రశంసించారు. ఘటనకు సంబంధించిన వివరాలను నెతన్యాహు తదితరుల నుంచి తెలుసుకున్నానని చెప్పారు. దీంతో స్మిత్ సాహసాన్ని ప్రశంసించిన ప్రపంచ నాయకుల జాబితాలో భారత ప్రధాని మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా చేరారు.
'దేశం గర్విస్తోంది'.. రాష్ట్రపతి ముర్ము
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన అసాధారణ సాహసం, సమయస్ఫూర్తి దేశ ప్రజలను కదిలించాయని, దేశం ఆయనను చూసి గర్విస్తోందని పేర్కొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ స్మిత్ను "అసాధారణ హీరో"గా అభివర్ణించారు. తీవ్ర గాయాల మధ్య ఆయన తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ప్రశంసించారు. లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఆయనను నిజమైన హీరోగా కొనియాడారు.

మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా

(మొదటి తరువాయి)

ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు.

అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

(మొదటి తరువాయి)

గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ – బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల

దేవరకొండ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం

-రూ.80.17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం
-ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ అక్టోబర్ 1 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.
దేవరకొండ పట్టణంలోని 8వ వార్డులో రూ.80.17 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రారంభించారు. అనంతరం అదే వార్డులోని మరో కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటిస్తూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు.
దేవరకొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజల





అవసరాలను గుర్తించి దాదాపు రూ.20 కోట్లకు పైగా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లుల ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని, మిగిలిన పనులను కూడా నాణ్యతతో త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.
పట్టణం అభివృద్ధి చెందాలంటే రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు మెరుగ్గా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.
కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే బాలు నాయక్.. ప్రజలతో నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు సూచించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తోందనిలి ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, వైస్ చైర్‌పర్సన్ జువెరియా తబస్సుం సమీర్, స్థానిక కౌన్సిలర్ కేతావత్ అజయ్ చంద్ర, మహమ్మద్ రయిస్, నజీరుద్దీన్ పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లా -01అక్టోబర్ (మహాప్రభ).
రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రెండవ విడతలో ఇంకా మిగిలి ఉన్న అర్హత గల ఇందిరమ్మ గృహ నిర్మాణాలలో సరైన లబ్ధిదారులను గుర్తించి, లబ్ధిదారుల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలన్నారు.
మొదటి విడతలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా సంబంధిత ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు ప్రతి నియోజవర్గానికి 1500



ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుడిసెలు, రేకుల ఇండ్లు, మట్టితో ఉన్న వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలు గృహరహిత కుటుంబాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. రెండో విడతలో ఇంకా మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా వివరాలను అందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. . నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పథకం అమలులో పారదర్శకత వేగం సమర్థతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి ఫీల్డ్ వెరిఫికేషన్ వేగంగా పూర్తి చేయాలన్నారు.గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలు గృహరహిత కుటుంబాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, జెడ్పి సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాహసిల్దార్లు, హౌసింగ్ ఏ ఈ, డి ఈ లు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కలెక్టర్ కు ఘన సన్మానం



దేవరకొండ అక్టోబర్ 1(మహా ప్రభ)
పద్మశాలి ముద్దు బిడ్డ రిటైర్డ్ కలెక్టర్ డాక్టర్. చిరంజీవులు దేవరకొండ విచ్చేసిన సందర్భముగా పట్టణ పద్మశాలి సంఘం మరియు మహిళా సంఘం మరియు యువజన సంఘం మరియు మార్కండేయ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. మన సంఘం అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసులు నివాసంలో వారికి అతిథి మర్యాదలతో సన్మానించడం జరిగినది. వారు మాట్లాడుతూ దేవరకొండలో పద్మశాలీ ల ఐక్యత కు మీ సంఘం చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు

అబ్బెందలో స్వచ్ఛత సేవా కార్యక్రమం



నారాయణఖేడ్,అక్టోబర్ 1(మహా ప్రభ)
స్వచ్ఛత సేవ ఏక్ దిన్,ఏక్ గంటా,ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణఖేడ్ మండల పరిధిలోని అబ్బెందా గ్రామంలో పారిశుద్ధ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా గ్రామంలోని ప్రధాన దారులలో గల చెత్తను తొలగించి,ప్రజలకు అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేగరి అంబికా కిరణ్, ఉపసర్పంచ్ అవిటి రాములు,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,వార్డు సభ్యులు మరియు గ్రామ యువకులు,ప్రజలు పాల్గొన్నారు

ఘనంగా ఏలూరు శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

-ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏలూరి శ్రీనివాసరావు సేవలు: టీ.జీ.ఓ. హైదరాబాద్ జిల్లా శాఖ



హైదరాబాద్, అక్టోబర్ 1(మహా ప్రభ)
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈజెఎసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను టీ.జీ.ఓ. హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీ.జీ.ఓ. హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న ఏలూరి శ్రీనివాసరావు నాయకత్వం ఉద్యోగ వర్గానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీ.జీ.ఓ. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.ఐ. ఖాదర్, మాజీ జనరల్ సెక్రటరీ ఏ. సత్యనారాయణ పటేల్, కేంద్ర సంఘ నాయకులు సహదేవ్, డా. వెంకటేశ్వర్లు, డా. రామారావు, వినోద్ కుమార్, వెంకటయ్య, శ్రీరామ్, శ్రీనిలక్ష్మణ్ గౌడ్, విజయ్, వెంకటరమణ, షోకత్ హుస్సేన్, జిల్లా రెడ్డి, శిరీష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ తీగలు తగలడంతో విద్యుదాఘాతం..

-హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ రైతు మృతి

చింతపల్లి, అక్టోబర్ 1 (మహాప్రభ)
వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి చెందిన ఘటన చింతపల్లి మండలం నెల్వలపల్లిలో చోటుచేసుకుంది. నెల్వలపల్లికి చెందిన గజ్జల మల్లారెడ్డి (40) సెప్టెంబర్ 30న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పెడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు చేతులకు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య గజ్జల రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్ జెండర్లకు అవగాహన సదస్సు



దేవరకొండ అక్టోబర్ 1 (మహాప్రభ)
దేవరకొండ కోర్టు ఆవరణంలో ట్రాన్స్ జెండర్లకు అవగాహన సదస్సు గురువారం ఏర్పాటు చేశారు. మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి అనిత మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి హక్కులు ఉంటాయని, ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని తెలిపారు. కమ్యూనిటీకి వెల్ఫేర్ స్కీములు. హక్కులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు. ట్రాన్స్ జెండర్లు.సంబంధిత.బాధితులు తదితరులు పాల్గొన్నారు

వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఐకెపి ఆధ్వర్యంలో

-కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచన



గాంధారి: అక్టోబర్ 1 (మహాప్రభ)
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నాగ్లూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారానే విక్రయించుకునే అవకాశం కల్పించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం నిర్దేశించిన విధానంలో పంటను విక్రయించుకోవాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్ నాయక్, గ్రామ సంఘం అధ్యక్షురాలు కంది మీనా, ఐకెపి సీసీ గొర్రె రాములు, పాలకవర్గ సభ్యులు గొర్రె గంగాధర్, సెక్రటరీ సాయికుమార్, జీపీఓ నరసింహులు, ఐకెపి సీఏ గొర్రె భాస్కర్, జాదవ్ రమేష్, చందు, గడ్డ బాలయ్య, కాటమండి బలవంత్ రావు, జాదవ్ పండరావు, మక్త చందర్ రావు, గడ్డం రాములు, కంది నడిపి సాయిలు, భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు గంగాధర్, బాలగోల గంగాధర్, మక్త మాణిక్యరావు, చుక్కల శంకర్, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్‌ల నిరంతర నిఘా

-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్ జిల్లా -01అక్టోబర్ (మహాప్రభ
మెదక్ జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్‌లు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఈవ్‌టీజింగ్, మహిళలను వేధించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి 64 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, 67 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామని వెల్లడించారు. ఈ చర్యల్లో భాగంగా 4 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రత, ఈవ్‌టీజింగ్ నివారణ, సైబర్ నేరాలపై 44 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రత విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా పనిచేస్తారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి.!!

-ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటు.!!
-సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి.



వనపర్తి అక్టోబర్ 1 (మహాప్రభ)
గౌరవ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈరోజు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కోసం ఆర్. డి.ఓ సుబ్రమణ్యం కి దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా వ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం అని అన్నారు. నవంబర్ 2023 వరకు ఏదైనా యూనివర్సిటీలో అర్హత పొందినవారు అందరూ అర్హులని ,ఓటరు నమోదుకు నవంబర్ 6 తేదీ 2023 తుది గడువు ఉంటుంది కాబట్టి తప్పక నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, నందిమల్ల.అశోక్,ప్రేమ్ నాథ్ రెడ్డి,నాగన్న యాదవ్, గౌడ్ నాయక్,స్టార్. రహీం,సయ్యద్. జమీల్,మంద.రాము ఉన్నారు.

తిమ్మాపూర్‌లో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం

-రైతుల చెంతకు ఐకేపీ కొనుగోలు కేంద్రం



ఎల్లారెడ్డి, అక్టోబర్ 1, (మహాప్రభ):
తిమ్మాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వానాకాలం 2026--27 ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోనీ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. 'గ్రేడ్ ఏ' రకానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరగా, సన్న రకాల ధాన్యానికి అదనంగా రూ.500 చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని శుభ్రంగా, తగిన తేమతో తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా మెరుగైన ధర పొందడంతో పాటు మిల్లర్ల వద్ద కోతలు, తరుగు వంటి సమస్యలను నివారించవచ్చని అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

-మందకృష్ణ మాదిగ!!



వనపర్తి అక్టోబర్ 1 (మహప్రభ)
వనపర్తి: దళిత క్రైస్తవుల హక్కులు, సామాజిక భద్రతకు సంబంధించిన హోదా విషయంలో వారికిఎలాంటి అన్యాయం జరగకుండా కాపాడుకోవడానికి ఐక్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మించుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి వనపర్తి జిల్లాలో దళిత క్రైస్తవ సోదరులు నిర్వహించిన దళిత క్రైస్తవ గర్జన సభకు మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. దళిత క్రైస్తవుల హక్కులకు భంగం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దళిత క్రైస్తవుల హక్కులకు ఎలాంటి హాని కలగకుండా, వారి హోదాను పరిరక్షించుకునేందుకు రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని క్రైస్తవ సోదరులకు మందకృష్ణ మాదిగ సూచించారు. భవిష్యత్తులో జరిగే ప్రజా ఉద్యమాల్లో ఒక చేతిలో బైబిల్, మరో చేతిలో భారత రాజ్యాంగాన్ని పట్టుకుని, అన్ని మతాలను గౌరవిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల హక్కులను గౌరవిస్తూ, మత సామరస్యాన్ని కాపాడుకుంటూ, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా, ఐక్యంగా ఉద్యమించాలని మందకృష్ణ మాదిగ సూచించారు.ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు

కొండ భీమనపల్లి గ్రామంలో ఘనంగా పోషణ మాసం ముగింపు వేడుకలు

-ఫుడ్ స్టాల్స్ ను దర్శించిన- సబ్ కలెక్టర్



దేవరకొండ అక్టోబర్ 1 (మహాప్రభ)
పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సి డి పి ఓ చంద్రకళ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో, గర్భిణీ స్త్రీలు ఐరన్ (రక్తహీనత) లోపం రాకుండా ఉండాలంటే నిత్యం రాగిజావ, బెల్లం, పల్లీలు, ఆకుకూరలు మరియు సీజనల్ పండ్లను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయల్లో ఐరన్ అధికంగా ఉంటుందని, అలాగే పప్పుధాన్యాల ద్వారా శరీరానికి కావలసిన మాంసకృత్తులు ((ప్రోటీన్లు) లభిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల ఆరోగ్యం మెరుగుపడటం కోసం ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు,అంగన్‌వాడీ టీచర్స్, ఆయా లు గ్రామాలలో మంచి సేవలను అందిస్తున్నారు కొని ఆడినారు, ల పి. హెచ్.సి. డాక్టర్ తరుణ్ శిశువుల ఆరోగ్య పరిస్థితిని , గర్భిణీ స్త్రీల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాము అని తెలిపినారు, ఎంపీడీవో పార్వతి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు చిన్నారులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు తెలిపారు. అనంతరము ప్రతిజ్ఞ చేయడం జరిగింది సబ్ కలెక్టర్ ఫుడ్ స్టాల్ ను తిలకించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీను, ఉప సర్పంచ్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రాధ చిట్టెమ్మ, విజయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ సఫియా , అంగన్‌వాడీ టీచర్స్ ,పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా,గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు,తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోస పోయారు





-మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ అక్టోబర్ 1 (మహా ప్రభ)
రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో మోసపోని వర్గం లేదని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.గురువారం దేవరకొండ పట్టణంలోనీ పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో రవీంద్ర కుమార్ మాట్లాడుతూ....విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక కార్యకర్త ఉదయం రెండు గంటలు, రాత్రి రెండు గంటలు కేటాయించినా రోజుకు సుమారు 40 దరఖాస్తులు పూర్తి చేయవచ్చని తెలిపారు.యువత, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాలేజీ యాజమాన్యాలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని రవీంద్ర కుమార్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రవీంద్ర కుమార్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. సర్టిఫికెట్లు అందక ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారని, పేద విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించిందని రవీంద్ర కుమార్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కొత్త విధానాన్ని ప్రకటించినప్పటికీ, గత సంవత్సరాల బకాయిల విషయంలో విద్యార్థులు, కళాశాలల్లో ఆందోళన కొనసాగుతోందని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని రవీంద్ర కుమార్ అన్నారు. యువతను ఆకర్షించేందుకు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని .ఈ ఎన్నికలతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం ప్రారంభమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై రవీంద్ర కుమార్ ఆగ్రహం

- బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్ 1 (మహాప్రభ)
సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు.ఎన్నికలు జరిగి దాదాపు మూడేళ్లు గడిచిపోయాయని, ఇంకా రెండేళ్ల సమయం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. ఇంతకాలం పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన హామీలపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు.సిరిసిల్లలో 'ప్రజాపాలన సభ' నిర్వహించిన ముఖ్యమంత్రి.. రాష్ట్ర సమస్యలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులపై స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా కేటీఆర్‌ను, కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. కేటీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమేనని విమర్శించారు.ప్రభుత్వం చేయబోయే పనులపై స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందు పెట్టాలని, ఇప్పటికే ఇచ్చిన హామీల అమలు పురోగతిపై ప్రజలకు సమాధానం చెప్పాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.'ఫిరంగులు పేలుద్దాం', 'గడీలను కూల్చుదాం' వంటి వ్యాఖ్యలు ముఖ్యమంత్రి స్థాయికి తగినవి కావని అన్నారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల పోరాట చరిత్రను గుర్తు చేసుకుని బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు."అభివృద్ధి గురించి అడిగితే సమాధానం లేదు.. హామీల అమలుపై ప్రశ్నిస్తే సమాధానం లేదు.. కేటీఆర్ అడిగిన ప్రశ్నలకు జవాబు లేదు.. కానీ వ్యక్తిగత విమర్శలు చేయడంలో మాత్రం ముఖ్యమంత్రి ముందుంటున్నారు" అని రవీంద్ర కుమార్ అన్నారు.రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, చేనేత కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఒక వ్యక్తిని, ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.ప్రతిపక్ష నాయకులపై రాజకీయ విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం ముఖ్యమని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.కక్షసాధింపు రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన ముఖ్యమంత్రికి సూచించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని రవీంద్ర కుమార్ అన్నారు.

నేడు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభ

-మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహణ : ఎంపీడీఓ



గాంధారి: అక్టోబర్ 01 (మహాప్రభ)
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం గాంధారి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) రాజేశ్వర్,ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభల్లో ముఖ్యంగా కింది అంశాలపై చర్చించి అవసరమైన తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.
గ్రామ సభ ఎజెండా అంశాలు:
శాశ్వత్ పంచాయతీ కార్యక్రమంపై చర్చ. (వి బి జి రాంజీ) ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటిపై చర్చించి తీర్మానాలు చేయడం.
లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై చర్చ. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చ. గ్రామ ప్రజలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు గ్రామ సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వండి..

--చేతికొచ్చిన పంటను కాపాడండి
-- కోయిలసాగర్ ఎడమ కాలువపై అక్రమ మోటార్ల తొలగింపునకు డిమాండ్
--ఎంఆర్ఓ, ఎంపీడీఓలకు 19, 20, 21, 22 స్లూయిస్ రైతుల వినతి



దేవరకద్ర అక్టోబర్ 01 మహాప్రభ
దేవరకద్ర: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సాగునీరు అందక ఎండిపోతుండటంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. కోయిలసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువలో పేరుకుపోయిన పూడిక, ఎక్కడికక్కడ వెలిసిన అక్రమ మోటార్ల కారణంగా చివరి ఆయకట్టుకు చుక్కనీరు కూడా చేరని దుస్థితి నెలకొంది. తమ కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన 19, 20, 21, 22 స్లూయిస్ (తూముల) పరిధిలోని రైతులు స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆశ్రయించారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎడమ కాలువలో పేరుకుపోయిన పూడికను తక్షణమే తొలగించాలని, నిబంధనలకు విరుద్ధంగా కాలువ వెంబడి ఏర్పాటు చేసిన అక్రమ మోటార్లను వెంటనే సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎగువన కొందరు అక్రమంగా నీటిని తోడేస్తుండటంతో దిగువన ఉన్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. కాలువ ప్రక్షాళన చేపట్టి, అక్రమ మోటార్లను తొలగించడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నిరంతరాయంగా సాగునీరు పారేలా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణసమానంగా సాకిన పంటలను కాపాడి తమను ఆదుకోవాలని, సాగునీరు అందక నష్టపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సకాలంలో స్పందించి న్యాయం చేయాలని రైతులు ఈ సందర్భంగా కోరారు.

విద్యాభివృద్ధికి పెద్ద పీట

-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో వనపర్తి పాఠశాలలకు రూ.3.15 కోట్లు

-నియోజకవర్గంలో 15 అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

-అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ గదుల నిర్మాణం



Sl No	Name of the Mandal	Name of the Village	Sanctioned Work	Estimated Cost (Rs. In Lakhs)	G.O / Proceedings No
1	Pebbair	Chelimilla	Construction of Balance Work of Additional Class Rooms to MPPS Chelimilla	15.00	Rev/CA/SMS/AS/0001/2026 (E-6223)
2	Pebbair	Pebbair	Strengthening og Bhavitha Centre through Construction of Activity Rooms-MRC Building at Pebbair	10.00	Lr.Rc.No.81/1/290/2025
3	Wanaparthy	Wanaparthy	Construction of Additional Class rooms (2 ACR's) to ZPHS HW at Wanaparthy Town	23.80	Rev/CA/SMS/AS/0001/2026 (E-6223)
4	Wanaparthy	Wanaparthy	Major Component 2.1:- Access & Retention-Strengthening of Existing Schools (IX-X)-Construction of Science Laboratory Rooms at KGBV Wanaparthy	26.00	RC.No.779/SS/CW/2026-27
5	Wanaparthy	Wanaparthy	Construction of Computer Rooms (IX-X) at KGBV Wanaparthy	25.00	RC.No.779/SS/CW/2026-27 1
6	Wanaparthy	Wanaparthy	Construction of Computer Rooms (IX-X) at Govt Jr.College Girls Wanaparthy	25.00	RC.No.779/SS/CW/2026-27 2
7	Yedula	Yedula	Construction of Additional Class rooms (2 ACR's) to MPPS Yedula	23.80	Rev/CA/SMS/AS/0001/2026 (E-6223)
8	Gopalpet	Gopalpet	Construction of Computer Rooms (IX-X) at KGBV Gopalpet	25.00	RC.No.779/SS/CW/2026-27 1
9	Gopalpet	Gopalpet	Major Component 2.1:- Access & Retention-Strengthening of Existing Schools (IX-X)-Construction of Science Laboratory Rooms at	26.00	
10	Ghanpur	Ghanpur	Major Component 2.1:- Access & Retention-Strengthening of Existing Schools (IX-X)-Construction of Science Laboratory Rooms at KGBV Ghanpur	26.00	RC.No.779/SS/CW/2026-2
11	Revally	Revally	Major Component 2.1:- Access & Retention-Strengthening of Existing Schools (IX-X)-Construction of Science Laboratory Rooms at ZPHS Revelly	26.00	
12	Revally	Keshampet	Magam Repair Elementary) (C324) - Taking up repairs to class rooms and other infrastructure facilities-MPPS Keshampet	4.56	RC.No.772/SS/CW/2026-2 1
13	Revally	Revally	Major Component 2.1:- Access & Retention-Strengthening of Existing Schools (IX-X)-Construction of Science Laboratory Rooms at KGBV, Revelly	26.00	RC.No.779/SS/CW/2026-2
14	Ghanpur	Ghanpur	Access & Retention -- Major Repair (IX-X) (C4365) - Taking up repairs to class rooms and other infrastructure facilities-ZPHS Ghanpur	15.00	RC.No.772/SS/CW/2026-2 2
15	Ghanpur	Solipur	Major Repair (IX-X) (C4365) - Taking up repairs to class rooms and other infrastructure facilities-ZPHS Solipur	18.00	
			TOTAL	315.16	

వనపర్తి అక్టోబర్ 1 (మహాప్రభ)

అంగన్‌వాడి స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమూల మార్పులకు ప్రభుత్వం చర్యలులిబి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు,తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతో విద్యకు కొత్త రూపు విదేశీ విద్యా విధానాల అధ్యయనంతో బోధనలో వినూత్న మార్పులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అంగన్‌వాడి, పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది ఈ క్రమంలో వనపర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషి, చొరవతో చేపట్టిన ప్రతిపాదనల నేపథ్యంలో 15 అభివృద్ధి పనులకు రూ.3 కోట్ల 15 లక్షల 16 వేల నిధులు మంజూరయ్యాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ నుంచి 12వ తరగతి వరకు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్య, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తోంది. ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులు, బదిలీలతో పాటు పాఠ్యాంశాల్లో ఆధునిక మార్పులపైనా దృష్టి సారించింది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో విద్యనందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తోంది. ఒకే ప్రాంగణంలో విద్యాబోధన, వసతి, సైన్స్, కంప్యూటర్, ఏఐ, స్కిల్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు అందుబాటులోకి తీసుకురావడం వీటి ప్రత్యేకత మరోవైపు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకేచోట నాణ్యమైన విద్య, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు వంటి సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో వనపర్తి మండలం వెల్టూరులో రూ.11.75 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రంలోని ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఫిన్లాండ్, జర్మనీ వంటి దేశాలకు పంపించి అక్కడి బోధనా పద్ధతులు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, క్రమశిక్షణ, ఆధునిక విద్యా విధానాలను అధ్యయనం చేయించడం విద్యా సంస్కరణల్లో మరో ముఖ్యమైన అంశం. ఈ విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా వనపర్తి నియోజకవర్గానికి తాజాగా మంజూరైన నిధులతో పెబ్బేరు మండలం చెలిమిల్ల ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల మిగిలిన నిర్మాణ పనులకు రూ.15 లక్షలు, పెబ్బేరు భవిత కేంద్రంలో యాక్టివిటీ రూముల నిర్మాణానికి రూ.10 లక్షలు, వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులకు రూ.23.80 లక్షలు కేటాయించారు. వనపర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు, యెదుల ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులకు రూ.23.80 లక్షలు మంజూరయ్యాయి. గోపాల్‌పేట కస్తూర్బా విద్యాలయంలో కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు, సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, ఘనపూర్ కస్తూర్బా విద్యాలయంలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, రేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, రేవల్లి కస్తూర్బా విద్యాలయంలో మరో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు కేటాయించారు. అలాగే రేవల్లి మండలం కేశంపేట ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు రూ.4.56 లక్షలు, ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరమ్మతులకు రూ.15 లక్షలు, ఘనపూర్ మండలం సోలిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరమ్మతులకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను అధిగమించడం, గ్రామీణ విద్యార్థులకు సైతం ఆధునిక విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడంపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, అభివృద్ధి పనులకు నిధుల సాధన కోసం కృషి చేయడంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో విద్యా సదుపాయాలను బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయి.

గాంధీ జయంతి సందర్భంగా రేపు మాంసం దుకాణాలు , మద్యం షాపులు బంద్







రామాయంపేట, అక్టోబర్ 01 మహాప్రభ

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రేపు అనగా ది. 02-10-2026 గురువారం రోజున ప్రభుత్వ ఆదేశాల మేరకు రామాయంపేట మున్సిపల్ పరిధిలోని అన్ని రకాల మాంసం విక్రయ దుకాణాలు , మద్యం షాపులు, కళ్లు దుకాణాలు,పూర్తిగా మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ రోజు జంతువులను వధించడం మరియు మాంసం విక్రయించడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయబడునని తెలిపారు.

బీసీలకు కనీసం ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలి.. మెట్టు గంగారం



రామాయంపేట, అక్టోబర్ 01 మహా ప్రభ

మెదక్ జిల్లా రామాయంపేటలో బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం గురువారం మాట్లాడుతూ 2027 మార్చిలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ అగ్రకులాలకు కేటాయిస్తే బీసీలను అవమానించినట్లేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులపై పునరాలోచించి కనీసం ఒక స్థానాన్ని బీసీలకు కేటాయించాలని ఆయన కోరారు.

నేరేడు గొమ్ము అభివృద్ధి కి ప్రత్యేక ప్రాధాన్యం





- ఎమ్మెల్యే బాలు నాయక్.

దేవరకొండ డివిజన్ అక్టోబర్ 1 (మహా ప్రభ)

నేరేడు గమ్ము మండలంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌డ్రైనేజీల పనులకు శంకుస్థాపన.ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్
కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్
నేతలు.అభివృద్ధి,సంక్షేమానికి.ఆకర్షితులైచేరుతున్నామని వెల్లడి. నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసిఆదర్శమండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే.నేనావత్ బాలు నాయక్.అన్నారు. గురువారం నేరేడుగొమ్ము మండలకేంద్రంలోపలుఅభివృద్ధి,సంక్షేమఆయనపాల్గొన్నారు.మండల కేంద్రంలో వి బి జి ఆర్ ఏ ఎం, జి .నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో అండర్‌డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే.శంకుస్థాపనచేశారు.ప్రజలకు అవసరమైన మౌలికవసతులనుదశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం.అనంతరం నేరేడుగొమ్ము మండల
కేంద్రంలోగొర్లధనలక్ష్మిఆంజనేయులు.చిల్లా అనూష.ఆంజనేయులు, వరికుప్పల.వెంకటమ్మ, కాశయ్య, వరికుప్పల మహేశ్వరివెంకన్న, హనుమంతు, ఈదమ్మ,ఈదయ్య,నాగజి, శారదకృష్ణయ్య కుటుంబాలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 2026.27.బడ్జెట్‌లోరూ.5,500 కోట్లు కేటాయించింది. కొత్త గ్రామ శాఖ అధ్యక్షులకు సన్మానం చేశారు నేరేడు గోమ్ము మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో.నేరేడు గొమ్ము పందిరిగుండు తండా,జోడుబావి తండా, చర్లతండా గ్రామాలకు నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు,
కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే బాలు నాయక్ అభినందించి సన్మానించారు.కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దేవరకొండ.నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే బలంగా ఉందని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత పటిష్టం చేయాలనిఅన్నారు.
బీఆర్ఎస్‌ను వీడికాంగ్రెస్‌లో
చేరిక.ఈసందర్భంగానేరేడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు బొమ్మనోని లింగయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బైకని సాలయ్యలి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలు నాయక్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అభివృద్ధి, సంక్షేమంతో ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నాం. కాంగ్రెస్‌లో చేరిన వారు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ తమ ప్రాంతానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందలేదని, పార్టీలో తమకు సరైన ప్రాధాన్యత కూడా లభించలేదని తెలిపారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎమ్మెల్యే బాలు నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో
చేరుతున్నామని. పేర్కొన్నారు.నేరేడుగొమ్ముకు భారీ మెజారిటీ. అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తా నేరేడు గొమ్ము చిన్న మండల మైనప్పటికీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ అందించిన మండలాల్లో ఒకటిగా నిలిచిందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పైఉంచిననమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నేరేడుగొమ్ము మండలాన్ని, మండల కేంద్రాన్నిఅభివృద్ధిలోముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.630 సర్వే నంబర్ రైతులకు న్యాయం చేస్తాం నేరేడుగొమ్ము.గ్రామపరిధిలోని 630 సర్వే నంబర్‌లో భూములు కలిగి ఉన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వ నిబంధనలు, విధానాలకు అనుగుణంగా అర్హత కలిగిన నిజమైన రైతులకు పట్టాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.అదేవిధంగా పెళ్లిపాకుల రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన 630 సర్వే నంబర్ రైతులకు నష్టపరిహారం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు.రైతులసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వంచిత్తశుద్ధితోపనిచేస్తోందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం నేరేడుగొమ్ము మండలంలోని ప్రతి గ్రామం, తండాకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, ఇళ్లు, విద్య, మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు,
ప్రజాప్రతినిధులుసమన్వయంతోపనిచేయాలని సూచించారు.మండల అధికారులతో సమీక్ష.అనంతరంనేరేడుగొమ్ము మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మండల అధికారులతో ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష,సమావేశం నిర్వహించారు.మండలానికిసంబంధించిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల,అమలుపైఅధికారులతో చర్చించారు. వివిధ పనులకోసంకార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారి సమస్యలనుసత్వరమే పరిష్కరించేలా అధికారులు
చర్యలు.తీసుకోవాలనిసూచించారు. ,ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యతతో,పనిచేయాలనిఎమ్మెల్యే ఆదేశించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మండల అధ్యక్షుడు వాంకునావత్,బిక్కునాయక్ జిల్లా కార్యదర్శి లోకసాని కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ పులికంటి సుధాకర్, కోతి యుగంధర్‌రెడ్డివాంకునావత్ పాపానాయక్, గిరియాదయ్య గౌడ్,గడ్డంవెంకటయ్య, కొప్పుల సురేందర్ రెడ్డి, ఎలిజర్ల.శ్రీను,నీలంఆంజనేయులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక

-పోతంగల్ కలాన్ విద్యార్థినుల ఘనత



గాంధారి: అక్టోబర్ 01 (మహాప్రభ)

మండలంలోని పోతంగల్ కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చింతకుంట హరిస్మిత, గొల్ల అక్షిత సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సెలెక్షన్స్ లో వీరు ప్రతిభ కనబరిచారని ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. కొమరంభీం జిల్లా ఆసిఫాబాద్ లో అక్టోబర్ 10 నుండి 12 వరకు జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో వీరు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు రంగారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను సర్పంచ్ అనుశ్రీ బాలరాజు, ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు మాంసాహార విక్రయ
దుకాణాలు నిలిపివేయాలి

-మున్సిపల్ కమిషనర్: రామ దుర్గా రెడ్డి



దేవరకొండ అక్టోబర్ 1 (మహాప్రభ)

దేవరకొండ పురపాలక సంఘం పరిధిలోని చికెన్, మటన్, చేపలు మరియు ఇతర మాంసాహార విక్రయ దుకాణాల యజమానులందరికీ తెలియజేయునది ఏమనగా,ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని జీవహింస నివారణ మరియు అహింసా సూత్రాల పాటింపు దృష్ట్యా, మున్సిపల్ నిబంధనలు మరియు ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవరకొండ పట్టణ పరిధిలోని చికెన్, మటన్, చేపలు మరియు ఇతర మాంసాహార విక్రయ దుకాణాలన్నింటినీ సంబంధిత తేదీన తప్పనిసరిగా మూసివేయవలసిందిగా ఆదేశించడమైనది. కావున పట్టణంలోని చికెన్, మటన్, ఫిష్ మరియు ఇతర నాన్‌వెజ్ షాపుల యజమానులందరూ ఈ ఆదేశాలను పాటిస్తూ అక్టోబర్ 2వ తేదీన మాంసాహార విక్రయాలు పూర్తిగా నిలిపివేయవలసిందిగా తెలియజేయడమైనది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పదివేల రూపాయలు జరిమానా విధించబడును సంబంధిత మున్సిపల్ నిబంధనలు మరియు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి ఆదేశించారు.

బిజినెస్

నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

-570 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
-198 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
-71,909.70 వద్ద ముగిసిన సెన్సెక్స్
-22,421.95 వద్ద స్థిరపడిన నిఫ్టీ
-లాభాల్లో వెల్స్‌పన్ లివింగ్, ఎంఫసిస్, ఇన్ఫోసిస్
-బజాజ్ ఆటోకు నష్టాలు
-చెన్నై పెట్రోలియం, సంసేరా ఇంజనీరింగ్ డౌన్
-భారీ అమ్మకాలతో మార్కెట్లకు నష్టం



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. ఉదయం నుంచి ఒడిదుడుకుల మధ్య కొనసాగిన సూచీలు చివర్లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ గణనీయంగా పతనమయ్యాయి. పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రధాన సూచీలు నష్టాల్లో స్థిరపడ్డాయి.సెన్సెక్స్ 570.59 పాయింట్లు లేదా 0.79 శాతం నష్టపోయి 71,909.70 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 198.50 పాయింట్లు లేదా 0.88 శాతం క్షీణించి 22,421.95 వద్ద స్థిరపడింది. కీలక సూచీలు వరుసగా నష్టాలను నమోదు చేయడంతో మార్కెట్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కొన్ని కంపెనీల షేర్లు మాత్రం కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో కొనసాగాయి. వెల్స్‌పన్ లివింగ్, ఎంఫసిస్, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు బజాజ్ ఆటో, చెన్నై పెట్రోలియం, సంసేరా ఇంజనీరింగ్ షేర్లు నష్టాలను చవిచూశాయి. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో ఈ షేర్లు దిగువకు జారాయి. మొత్తంగా ప్రధాన సూచీలు గణనీయంగా నష్టపోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రతికూలంగా ముగిశాయి. సూచీల పతనంతో మదుపరులు తదుపరి మార్కెట్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

-24 క్యారెట్ల పసిడిపై రూ.330 తగ్గుదల
-10 గ్రాముల బంగారం రూ.1,49,240
-22 క్యారెట్ల బంగారంపై రూ.300 తగ్గింపు
-22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,800
-కేజీ వెండి ధర రూ.2,45,000
-హైదరాబాద్ బులియన్ మార్కెట్లో స్వల్ప మార్పు
-అంతర్జాతీయ పరిణామాల ప్రభావం
-ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గురువారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. వరుస మార్పులతో పసిడి ధరలు కదలాడుతున్న నేపథ్యంలో గురువారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 తగ్గి రూ.1,49,240కి చేరింది. బుధవారం నమోదైన ధరతో పోలిస్తే గురువారం పసిడి ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా తగ్గింది. రూ.300 మేర పతనమై రూ.1,36,800 వద్ద కొనసాగుతోంది. ఆభరణాల తయారీలో ప్రధానంగా వినియోగించే 22 క్యారెట్ల బంగారం ధర తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించింది. మరోవైపు వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్ మార్కెట్లో కేజీ వెండి ధర రూ.2,45,000 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరలు స్వల్పంగా తగ్గినా వెండి ధర స్థిరంగా ఉండటం గమనార్హం. బులియన్ మార్కెట్లో ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి పలు అంశాల ఆధారంగా రోజువారీగా మారుతూ ఉంటాయి. దీంతో ఒకరోజు పెరిగిన ధరలు మరుసటి రోజు తగ్గడం, లేదా స్థిరంగా కొనసాగడం సాధారణంగా జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ప్రాంతాలను బట్టి స్వల్పంగా మారే అవకాశం ఉంటుంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, వ్యాపారుల మార్జిన్ల కారణంగా హైదరాబాద్ ధరలతో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో కొంత తేడా ఉండొచ్చు. కొనుగోలు చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోని స్థానిక బులియన్ మార్కెట్ ధరలను పరిశీలించడం మంచిది.

భారీగా తగ్గిన క్రూడాయిల్ ధరలు

-అంతర్జాతీయ మార్కెట్లో భారీగా తగ్గిన చమురు ధరలు
-105 డాలర్లకు పైగా చేరిన బ్రెంట్ ధర
-తాజాగా 97.41 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్
-ఒక్కరోజులో సుమారు 6 డాలర్ల తగ్గుదల
-89.66 డాలర్ల వద్ద డబ్ల్యూటీఐ క్రూడ్
-మధ్యప్రాచ్యం నుంచి పెరిగిన చమురు రవాణా
-సరఫరా పెరగడంతో ధరలపై ఒత్తిడి
-అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం



అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇటీవల భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారీగా పెరిగిన చమురు ధరలు తాజాగా దిగివచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక దశలో 105 డాలర్లను దాటగా.. ప్రస్తుతం 97.41 డాలర్లకు చేరింది. బుధవారం (సెప్టెంబర్ 30) నమోదైన ధరతో పోలిస్తే దాదాపు 6 డాలర్ల మేర తగ్గడం గమనార్హం. మరోవైపు అమెరికా మార్కెట్‌కు సంబంధించిన డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా తగ్గింది. ప్రస్తుతం బ్యారెల్ డబ్ల్యూటీఐ క్రూడ్ 89.66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల్లో చోటుచేసుకున్న ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, సౌదీ అరేబియాపై హౌతీల దాడుల నేపథ్యంలో ఇటీవల చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు వేగంగా పెరిగి 105 డాలర్ల స్థాయిని దాటాయి. అయితే తాజాగా మధ్యప్రాచ్యం నుంచి చమురు రవాణా క్రమంగా పెరుగుతుండటంతో సరఫరాపై ఉన్న ఆందోళనలు కొంత తగ్గాయి. ముడిచమురు సరఫరా పెరగడం, మార్కెట్లో అందుబాటులో ఉన్న చమురు పరిమాణం మెరుగుపడటంతో ధరలపై ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ధరలు గణనీయంగా తగ్గాయి. ముడిచమురు ధరల కదలికలను అంతర్జాతీయ సరఫరా, డిమాండ్, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఉత్పత్తి దేశాల నిర్ణయాలు ప్రభావితం చేస్తుంటాయి. క్రూడాయిల్ ధరల్లో ఇలాంటి భారీ మార్పులు చోటుచేసుకుంటే దాని ప్రభావం ఇంధన మార్కెట్లతో పాటు రవాణా, తయారీ, ఇతర రంగాలపై కూడా పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఆధారపడే దేశాల్లో అంతర్జాతీయ ధరల కదలికలను మార్కెట్ వర్గాలు నిశితంగా పరిశీలిస్తుంటాయి.

స్పోర్ట్స్

హైవోల్టేజ్ గేమ్‌లో నెగ్గిన భారత్.. హాకీ ఫైనల్లోకి

-పాకిస్థాన్‌పై భారత్ 4-3తో విజయం
-ఆసియా క్రీడల ఫైనల్లోకి భారత పురుషుల జట్టు
-హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్
-సుఖ్‌జీత్ సింగ్ ఖాతాలో మరో గోల్
-3-0 ఆధిక్యం నుంచి పుంజుకున్న పాకిస్థాన్
-3-3తో ఉత్కంఠగా మారిన మ్యాచ్
-చివరి నిమిషంలో అభిషేక్ నిర్ణాయక గోల్
-మలేషియా-దక్షిణ కొరియా విజేతతో ఫైనల్ పోరు



కాకామిఘర: ఆసియా క్రీడలు-2026 పురుషుల హాకీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ 4-3 గోల్స్ తేడాతో ఓడించింది. మ్యాచ్ ఆరంభంలో 3-0 ఆధిక్యం సాధించిన భారత్‌కు పాకిస్థాన్ గట్టి పోటీ ఇస్తూ 3-3తో సమం చేసింది. చివరి నిమిషంలో అభిషేక్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ విజయాన్ని అందుకుంది. దీంతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు. 5వ, 13వ నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్లను అతడు గోల్స్‌గా మలిచి భారత్‌కు శుభారంభం అందించాడు. అనంతరం 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ సమయంలో భారత జట్టు పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే పాకిస్థాన్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 30వ నిమిషంలో అబూ మహ్మూద్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని 3-1కి తగ్గించాడు. ద్వితీయార్ధంలో పాకిస్థాన్ మరింత దూకుడుగా ఆడింది. 45వ నిమిషంలో హన్నన్ షాహిద్ గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 3-2కి చేరింది. ఆ తర్వాత 49వ నిమిషంలో వహీద్ అష్రఫ్ రాణా గోల్ చేయడంతో స్కోరు 3-3తో సమమైంది. మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లడం ఖాయమనుకుంటున్న సమయంలో భారత్ చివరి నిమిషంలో విజయం సాధించింది. ఆట ముగియడానికి సుమారు 49 సెకన్ల ముందు అభిషేక్ గోల్ చేశాడు. అతడి షాట్ పాకిస్థాన్ డిఫెండర్ స్టిక్‌కు తగిలి దిశ మార్చుకుని గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో భారత్ 4-3 ఆధిక్యంలోకి వచ్చింది. మిగిలిన సమయాన్ని భారత ఆటగాళ్లు సమర్థంగా ఎదుర్కొని విజయాన్ని ఖాయం చేసుకున్నారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత జట్టు దూకుడుగా ఆడింది. వరుసగా పెనాల్టీ కార్నర్లు సాధిస్తూ పాకిస్థాన్ రక్షణపై ఒత్తిడి పెంచింది. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్, సుఖ్‌జీత్ మరో గోల్‌తో తొలి దశలోనే భారత్ భారీ ఆధిక్యం సాధించింది. అయితే రెండో అర్ధభాగంలో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుని భారత గోల్‌పోస్ట్‌పై దాడులు పెంచడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఉత్కంఠగా మారింది. 3-0 ఆధిక్యం కోల్పోయినప్పటికీ చివరి క్షణాల్లో భారత్ ఒత్తిడిని తట్టుకుని నిర్ణాయక గోల్ సాధించింది. అభిషేక్ చేసిన చివరి నిమిషం గోల్‌తో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఈ విజయంతో భారత పురుషుల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో వరుసగా స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకునే దిశగా మరో అడుగు ముందుకేసింది. ఫైనల్లో భారత్ మలేషియా, దక్షిణ కొరియా మధ్య జరిగే రెండో సెమీఫైనల్‌లో విజయం సాధించిన జట్టుతో తలపడనుంది. స్వర్ణ పతకం కోసం తుది పోరు అక్టోబర్ 3న జరగనుంది.

సెమీస్‌లో శ్రీలంకపై భారత్ ఘన విజయం..

-శనివారం పాకిస్థాన్‌తో గోల్డ్ మెడల్ మ్యాచ్



నగోయా:
ఏషియన్ గేమ్స్ లో బిగ్ క్లాష్ జరగనున్నది. టీ20 సమరంలో దాయాదులు పాకిస్థాన్, భారత్ శనివారం తలపడనున్నాయి. ఇవాళ జరిగిన రెండో సెమీస్ మ్యాచ్‌లో భారత్ జట్టు 124 రన్స్ తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. జపాన్‌లోని నిషిన్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత జట్టు 7 వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. అయితే చేజింగ్‌లో శ్రీలంక చితికిలపడింది. కేవలం 9.5 ఓవర్లలో 45 రన్స్‌కే ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ రెండేసి వికెట్లు తీసుకున్నారు.పరుగులు రాబట్టడం కష్టంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు తొలుత తడబడ్డారు. ఇషాన్ కిషన్ చాకచక్యంగా బ్యాటింగ్ చేశాడు. 46 బంతుల్లో 80 రన్స్ చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. ఇక ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 21 బంతుల్లో సూర్యవంశీ 38 రన్స్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 170 టార్గెట్‌తో చేజింగ్‌కు దిగిన శ్రీలంక ఏ దశలోనూ భారత బౌలర్లను ఎదుర్కోలేకపోయింది. అయిదుగురు లంక బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఫెర్నాండో ఒక్కడే రెండు అంకెల స్కోరు చేశాడు. మరో వైపు బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో పాకిస్థాన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 13 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 111 రన్స్ చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్ 11.3 ఓవర్లలో టార్గెట్‌ను అందుకున్నది. అబ్దుల్ సమద్ 30, నవాజ్ 27 రన్స్ చేసి పాక్‌ను గెలిపించారు. ఇక ఇండియా, పాకిస్థాన్ జట్లు శనివారం జరిగే గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో పోటీపడనున్నాయి.

గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో నితేశ్‌కు రజతం

-97 కేజీల విభాగంలో రజత పతకం
-ఫైనల్లో నితేశ్ సివాచ్‌కు పరాజయం
-జపాన్ రెజ్లర్ యూరి నకాజాటో చేతిలో ఓటమి
-0-4 పాయింట్ల తేడాతో నితేశ్ పరాజయం
-నితేశ్‌కు గట్టి పోటీ ఇచ్చిన నకాజాటో
-తొలి బౌట్‌లో 2-0 ఆధిక్యం సాధించిన జపాన్ రెజ్లర్
-చివరి నిమిషంలోనూ నితేశ్ ప్రయత్నాలు విఫలం
-గ్రీకో రోమన్‌లో భారత్‌కు మరో పతకం



నగోయా:
జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో భారత్‌కు మరో పతకం లభించింది. గ్రీకో రోమన్ రెజ్లింగ్ 97 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నితేశ్ సివాచ్ రజత పతకాన్ని సాధించాడు. గురువారం జరిగిన ఫైనల్లో నితేశ్ 0-4 పాయింట్ల తేడాతో జపాన్‌కు చెందిన యూరి నకాజాటో చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో స్వర్ణ పతకాన్ని కోల్పోయిన నితేశ్ రజతంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్ పోరులో నితేశ్ ఆరంభం నుంచే గట్టిగా పోరాడాడు. ప్రత్యర్థిపై గ్రిప్ సాధించేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. అయితే స్థానిక రెజ్లర్‌గా బరిలోకి దిగిన నకాజాటో భారత ఆటగాడి వ్యూహాలను సమర్థంగా అడ్డుకున్నాడు. నితేశ్‌కు స్కోరింగ్ అవకాశం ఇవ్వకుండా తన రక్షణను పటిష్ఠంగా కొనసాగించాడు. తొలి బౌట్‌లో నకాజాటో 2-0 ఆధిక్యం సాధించాడు. ఆ తర్వాత రెండో బౌట్‌లోనూ జపాన్ రెజ్లర్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. నితేశ్‌ను నేలకూల్చి మరో రెండు పాయింట్లు సాధించడంతో ఆధిక్యం 4-0కు చేరింది. దీంతో నితేశ్‌పై ఒత్తిడి పెరిగింది. చివరి నిమిషంలో నితేశ్ దూకుడుగా ఆడుతూ పాయింట్లు సాధించేందుకు ప్రయత్నించాడు. అయితే నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో భారత రెజ్లర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నాడు. నితేశ్‌కు ఒక్క పాయింట్ కూడా దక్కకుండా ఫైనల్‌ను ముగించాడు. దీంతో 4-0 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. నితేశ్ ఫైనల్ వరకు అద్భుతంగా పోరాడి రజత పతకాన్ని సాధించడం ద్వారా భారత ఖాతాలో మరో పతకాన్ని చేర్చాడు. గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో భారత్‌కు గతంలో రెండుసార్లు స్వర్ణ పతకాలు లభించాయి. 1962లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో 52 కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు సాధించారు. ఈసారి 97 కేజీల విభాగంలో నితేశ్ సివాచ్ ఫైనల్ వరకు చేరుకుని రజత పతకం సాధించడం ద్వారా గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో భారత్ తరఫున తన పేరును నమోదు చేసుకున్నాడు. స్వర్ణం కోసం జరిగిన తుది పోరులో ఓటమి ఎదురైనా.. పోటీలో చివరి వరకు పోరాడి రజత పతకాన్ని దక్కించుకున్నాడు.

ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ 'సర్దార్ 2'

కార్తీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'సర్దార్ 2' ఎట్టకేలకు డిజిటల్ మాధ్యమంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ రెండవ భాగంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలై నెగిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయాన్ని అందుకుంది. ఇక దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో కార్తీ మరోసారి ద్విపాత్రాభినయంతో అదరగొట్టారు.ఇక ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా, మాళవిక మోహనన్ , ఆషికా రంగనాథ్ , రజీషా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.



రెండు పార్టులుగా అల్లు అర్జున్ 'రాకా'?

పాన్-ఇండియా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'రాకా' చుట్టూ ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. మాస్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్, యాక్షన్ థ్రిల్లర్‌ను ఒకే పార్టుగా కాకుండా ఏకంగా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం.ఈ సినిమాకు సంబంధించిన కథా పరిధి ఊహకందనంత పెద్దదిగా ఉండటంతో పాటు, విభిన్న టైమ్‌లైన్స్ మరియు మల్టిపుల్ గెటప్స్‌తో కూడిన ఒక గ్లోబల్ వరల్డ్‌ను ఈ చిత్రంలో డైరెక్టర్ ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తున్న విశాలమైన నేపథ్యానికి పూర్తి న్యాయం చేయాలంటే, ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విభజించడమే సరైన మార్గమని చిత్ర యూనిట్ భావిస్తోందట. ఒకవేళ ఈ ప్లాన్ కనుక పక్కా అయితే, ఈ విజువల్ వండర్ మూవీకి సంబంధించిన మొదటి పార్ట్ డిసెంబర్ 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని, రెండో పార్ట్ 2028లో థియేటర్లలోకి వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.





యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల..

-నవ్వులు పంచుతూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హర్రర్-కామెడీ!

బాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా హర్రర్-కామెడీ 'నైయ్ నవెల్లి' . తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ హీరోయిన్ యామి గౌతమ్ ధర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఇక ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినీ వర్గాల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది.ఈ చిత్రంలో యామి గౌతమ్ సరసన ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ , హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ మరియు అమెజాన్ ఎంజిఎం స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. ఎంతో అస్తవ్యస్తంగా, గందరగోళంగా ఉన్న ఒక సాధారణ కుటుంబంలోకి యామి గౌతమ్ కొత్త కోడలిగా ప్రవేశించడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలోని అందరి జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చి, ప్రశాంతత చేకూరుతుంది. అయితే, ఆ ఇంట్లోని మరిది పాత్రలో నటిస్తున్న ఆదినాథ్‌కు ఆ కొత్త కోడలు ప్రవర్తన మరియు ఆమె పద్ధతుల మీద అనుమానం కలుగుతుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కోడలు నిజంగానే ఆ కుటుంబానికి దేవతలాంటి మనిషా లేక ఆమె వెనుక మరేదైనా దెయ్యం లేదా అంతుచిక్కని రహస్యం దాగుందా అనే కోణంలో ఈ ట్రైలర్ చాలా ఉత్కంఠభరితంగా, నవ్వులు పూయిస్తూనే వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతుంది. హర్రర్ మరియు కామెడీని చాలా చక్కగా మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్

దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన 'లోక చాప్టర్-1' చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె 'ప్రకయ్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి.ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిటినెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్ ఉందని చెబుతున్నారు. 'ప్రకయ్' చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

రానా సమర్పణలో కార్తీక్ సుబ్బరాజు గే లవ్‌స్టోరీ 'డోరతీ'

-తెలుగు ట్రైలర్ రిలీజ్

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త బోల్డ్ అండ్ ఎమోషనల్ డ్రామా చిత్రం 'డోరతీ' . ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా నిర్మించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషించగా, సనంత్, రిషికాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా తెలుగులోకి రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ప్రముఖ నటుడు రానా దగ్గుబాటికి చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సమాజంలోని పక్షపాతాలు, లింగ సమానత్వం, LGBTQIA+ మరియు జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే విభిన్నమైన, ధైర్యమైన కథాంశాన్ని కార్తీక్ సుబ్బరాజు ఆవిష్కరించారు. టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com